


కుక్కల దాడిలో మేకపిల్లలు మృతి

ప్రజాశక్తి - సాలూరు

పట్టణానికి చెందిన గొర్రెల కాపరి రంది అచ్యుత్‌కు చెందిన మేకపిల్లలు కుక్కల దాడిలో మృతి చెందాయి. ఆదివారం తన కళ్లంలోని పశువుల శాలలో మేకపిల్లలు పెంచుతున్న అచ్యుత్ తాళం వేయకుండా వదిలేశాడు. దీంతో కుక్కలు దూరి మేకపిల్లలపై దాడి చేశాయి. మొత్తం తొమ్మిది పిల్లలు మృతి చెందినట్లు కాపరి అచ్యుత్ తెలిపారు.



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

రంగవల్లులతో అంగన్వాడీల నిరసన

- 21రోజుకు చేరుకున్న నిరవధిక సమ్మె
- శిబిరంలో అస్వస్థతకు గురైన ఆయా

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఎపి అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా 21వ రోజు కొసాగింది. ఈ మేరకు పలుచోట్ల రంగవల్లులతోను, ఆటపాటలతో నిరసన తెలిపారు. కురుపాంలో సమ్మె శిబిరం వద్ద హెల్పర్ స్పృహ కోల్పోయింది. పార్వతీపురంలో కలెక్టరేట్ ఎదుట యూనియన్ ప్రాజెక్టు నాయకులు మద్రాపు అలివేలు, సాలూరు గౌరీమణి, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ పట్టణ నాయకులు బొత్స లక్ష్మి ఆధ్వర్యంలో రంగవల్లులు పెడుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని, వినూత్నంగా నిరసన తెలిపారు. ముందుగా అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని, నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. సమ్మెకు యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు మురళీమోహన్, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు మద్దతు తెలిపారు. అనంతరం కలెక్టరేట్ అవుట్ గేట్ ప్రాంగణాన్ని ముగ్గులతో ముంచెత్తి తమ నిరసనను నినాదాలు, పాటల రూపంలో తెలిపారు. కార్యక్రమంలో సెక్టార్ నాయకులు కె.రాజేశ్వరి, ఎం.గౌరీ, బి.సునీత, విమల, లలిత, రాజేశ్వరి, ధర్మావతి, నీలవేణి, గిరిజ, మరియు అధిక సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

పాచిపెంట : సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు కోలాటం, ఆటపాట మూగజీవాలతో అంగన్‌వాడీలు నిరసన చేపట్టారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా సమ్మె విరమించేది లేదని సమస్య పరిష్కారమయ్యేంత వరకు పోరాటం ఉధృతం చేస్తామని యూనియన్ ప్రాజెక్ట్ లీడర్స్ బంగారమ్మ, పైడిరాజు, బేగం, సరోజిని, తేరిజమ్మ, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు తెలిపారు.

దీక్ష శిబిరం వద్ద అస్వస్థత గురైన హెల్పర్

కురుపాం : స్థానిక పెట్రోల్ బంకు వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 21వ రోజుకు కూడా వినూత్న రీతిలో కొనసాగుతున్న సమయంలో చింతల బెలగాం పంచాయతీ తుమ్మల దత్తివలస గ్రామ అంగన్వాడీ హెల్పర్ కె.అప్పల నరసమ్మ అస్వస్థకు గురై దీక్ష శిబిరం వద్ద కుప్పకూలింది. వెంటనే శిబిరం వద్ద ఉన్న అంగన్వాడీలు సమీపంలో ఉన్న వైద్య సిబ్బందిని తీసుకొచ్చి వైద్య పరీక్ష చేయించి అవసరమైన మందులు అందించారు. ఈ సందర్భంగా అంగన్వాడీల జిల్లా అధ్యక్షులు పి. సరళ కుమారి మాట్లాడుతూ 21 రోజులుగా అంగన్‌వాడీలు దీక్ష చేపడుతున్నప్పటికీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేదని, దీంతో ఆమె మానసికంగా కృంగిపోయి మనస్థాపానికి గురై బీపీ డౌన్ అయి సొమ్మ సిల్లి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీలకు న్యాయం చేయాలని కోరారు.

సాలూరు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్లు చేపట్టిన సమ్మె సోమవారం 21రోజుకు చేరింది. సమ్మె లో భాగంగా నిరసన శిబిరం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అద్వర్యాన కార్యకర్తలు హెల్పర్లు ఆటలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు బి.రాధ మాట్లాడుతూ అంగన్వాడీ సేవలు స్తంభించిపోయినా రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేదని అన్నారు. తాము గొంతెమ్మ కోరికలు కోరడం లేదని చెప్పారు. సిఎం జగన్ ఇచ్చిన హామీ లనే అమలు చేయాలని కోరుతున్నామని చెప్పారు. మొండి వైఖరి విడనాడి డిమాండ్లు ఆమోదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎ.నారాయణమ్మ, శ్యామల, వరలక్ష్మి, తిరుపతమ్మ, పార్వతి ,శశికళ తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : ఆట పాటలు, సాంస్కృతిక నృత్యాలు చేస్తూ అంగన్వాడీలు నిరసన చేపట్టారు. ఈ శిబిరంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ కన్నా అదనపు వేతనం ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని, లబ్ధిదారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, అంగన్వాడీల పోరాటంపై రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రకటనలు, ఐక్యంగా మొక్కవోని దీక్షతో పోరాడుతున్న సమ్మె పోరాటాన్ని విచ్ఛిన్నం చేయాలనే కుట్రలు, కుతంత్రాలు ఆపాలని, లేనిచో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన తీవ్రతరం చేయాలని తెలిపారు. ఆందోళనలో భాగంగా అంగన్‌వాడీలు ముత్యం పాటలు పాడుతూ అందర్నీ అలరించారు. కార్యక్రమంలో ఐ.పార్వతి, జన్ని నారాయణ, ఎం.లక్ష్మి, అనురాధ, వి.సుశీల నృత్యాలు, పాటలు పడారు. యూనియన్ నాయకులు ఎల్.దాలమ్మ, వి.గౌరీశ్వరి, వై.పద్మ నాయకత్వం వహించారు.

కొమరాడ : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె సోమవారం 21రోజు కొనసాగింది. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ కేకు కట్ చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆటలు, పాటలు పాడుతూ నిరసన తెలిపారు. ఇప్పటికైనా అంగన్వాడీల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకొని వెంటనే చర్చలు జరిపి తమ సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.సాంబమూర్తి, పెద్దసంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ఐటిడిఎ అంగన్‌వాడీలు తలపెట్టిన నిరవధిక సమ్మె సందర్భంగా అడవి తల్లి విగ్రహానికి పూల దండలు వేసి వారి సమస్యలు పరిష్కారానికై వేడుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వీరి ఆందోళనకు సిఐటియు సీనియర్ నాయకులు



కురుపాంలో సమ్మె శిబిరంలో సొమ్మసిల్లిపోయిన హెల్పర్ అప్పలనర్సమ్మ

ఎం.తిరుపతిరావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎ.పార్వతి, ఎ.దర్శమి సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్.సురేష్, ఎం.కాంతారావు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన ఆందోళన 21వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా వినూత్నంగా అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని నినాదాలతో కూడిన డిమాండ్లను రంగులతో రాసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి గంట జ్యోతి, నాయకులు వై.సత్యవతి, ఆర్.లక్ష్మి, శైలజ, సునీత, అరుణ, శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.రామలక్ష్మి, సిఐటియు మండల కమిటీ కార్యదర్శి జి.వెంకటరమణ, ప్రజానాట్యమండలి నాయకులు వై.రామారావు వివిధ గ్రామాలకు చెందిన అంగన్వాడీస్ పాల్గొన్నారు.

అంగన్వాడీ సమ్మెకు ఉపాధ్యాయ సంఘాల ఆర్థిక సహకారం

సమస్యలు పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలకు సంఘీభావం తెలుపుతూ వీరి పోరాటానికి యుటిఎఫ్, పిఆర్‌టియు, ఎపిటిఎఫ్ సంఘాల నాయకులు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని చేస్తున్న పోరాట స్ఫూర్తికి తమ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండలశాఖ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరావు బి.ప్రసాద్, పిఆర్‌టియు నాయకులు, సిహెచ్ ఈశ్వరరావు, కె.అప్పడుదొర, ఎపిటిఎఫ్ నాయకులు పోలా సత్యనారాయణ, ఉమామహేశ్వరరావుతో పాటు మండల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సీతానగరంలో రంగవల్లులతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



మక్కువలో సమ్మెశిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న రెడ్డి వేణు



పాచిపెంటలో కోలాటం ఆడుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు





డిప్యూటీ సిఎం రాజన్నదొరకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్, అధికారులు; కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జెసి

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

మంత్రి రాజన్నదొరను కలిసిన కలెక్టర్, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్/సాలూరు

నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం డిప్యూటీ సీఎం రాజన్నదొర నివాసం సందడిగా కనిపించింది. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌తో పాటు ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, డిఆర్ఒ జె.వెంకటరావు ఆయన నివాసానికి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. గతేడాది ఇదే సమయంలో డిప్యూటీ సీఎం రాజన్నదొరకు శుభాకాంక్షలు చెప్పడానికి జిల్లాకు చెందిన ముఖ్య అధికారులు హాజరు కాలేదు. ఎన్నికలు మరో మూడు నెలల్లో రానున్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు కొంతమంది తమకు టికెట్లు వస్తాయో రావో నన్న అభద్రతాభావం లో వుండడం తో ఉమ్మడి జిల్లాకు చెందిన కీలక నేత లను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే విజయనగరంలోని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను జిసిసి చైర్‌పర్సన్ శోభా స్వాతీరాణి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టరేట్‌లో...

జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు పలువురు జిల్లా ఉన్నతాధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటిడిఎ పిఒలు కల్పనాకుమారి, విష్ణుచరణ్, డిఆర్ఒ వెంకట్రావు, డిఎఫ్ఒ ప్రసూనతో పాటు పలువురు జిల్లా ఉన్నతాధికారులు ఉన్నారు.

ఎస్పీ కార్యాలయంలో...

నూతన సంవత్సరం సందర్భంగా స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ఎస్పీ క్యాంపు ఆఫీస్, స్పెషల్ బ్రాంచి, ఎఆర్ అధికారులు, జిల్లా పోలీసు కార్యాలయాలలో పని చేసే సిబ్బంది, పోలీసు అధికారులు, పలువురు సిఐలు, ఎస్సైలు ఎస్‌పికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో....

స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు క్యాంపు కార్యాలయానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అలాగే యుటిఎఫ్ కేలండర్‌ను ఆవిష్కరించారు. బైపాస్ రోడ్డు లోని టిడిపి నూతన కార్యాలయంలో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్ర నియోజకవర్గ కార్యకర్తలు అభిమానులు మధ్య కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను ప్రారంభించారు. కృష్ణపల్లిలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులకు పెద్ద ఎత్తున అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, టిడ్కో రాష్ట్ర చైర్మన్ జమ్మన ప్రసన్నకుమార్ ఇంట్లో జరిగిన వేడుకలలో పెద్ద ఎత్తున మున్సిపల్, మెప్మా సిబ్బంది హాజరై శుభాకాంక్షలు తెలిపారు.


గుమ్మలక్ష్మీపురం : జియమ్మవలస మండలం చిన మేరంగి కోటలో నూతన సంవత్సర వేడుకలను కురుపాం ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి ఆధ్వర్యంలో వైసిపి నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు మాజీ ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు ఆధ్వర్యంలో న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇంచార్జి తోయక జగదీశ్వరి, టిడిపి నాయకులు, నాయకులు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని వండవలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వి.కళావతికి పలువురు అధికారులు, వైసిపి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.


పార్వతీపురం టౌన్ : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని స్థానిక మున్సిపల్ కార్యాలయం లో కమిషనర్ జె.రామప్పల నాయుడుకు సచివాలయాల ఉద్యోగులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి పుష్ప గుచ్ఛాలను అందజేశారు..



ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు



యుటిఎఫ్ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు





పాలకొండ ఎమ్మెల్యేకు అభినందనలు తెలుపుతున్న అధికారులు, కలెక్టర్‌కు కేక్ తినిపిస్తున్న ఎస్‌పి

నేటి నుంచి రెండో దశ ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) రెండవ దశ జనవరి 2వ తేదీ నుండి ప్రారంభమవుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నెలకు 72 శిబిరాలు జరుగుతాయని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మందులను కేంద్ర డ్రగ్ స్టోర్ నుంచి గ్రామ, వార్డు సచివాలయానికి పంపించి అక్కడి నుండి బాధితునికి అందజేస్తామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మంగళ, శుక్రవారాలు మండలాల్లోను, ప్రతి బుధవారం పట్టణ ప్రాంతాల్లోను వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలో ఉన్న మండలాల దృష్ట్యా ఎనిమిది మండలాల్లో మంగళవారం, ఏడు మండలాల్లో శుక్రవారం, పార్వతీపురం, సాలూరు, పాలకొండ మునిసిపల్ ప్రాంతాల్లో బుధవారం శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో మెరిసిన గిరిజన బాలురు

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో రాష్ట్ర స్థాయి గేమ్స్, స్పోర్ట్స్ పోటీల్లో స్థానిక గురుకుల విద్యార్థులు మరోసారి సత్తాచాటారు. ఇటీవల సాలూరు మండలం పి.కోనవలస గురుకుల కళాశాల మైదానంలో జరిగిన ఈ పోటీల్లో స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థి పి.ప్రభునందు వంద మీటర్ల పరుగు పందెంలో బంగారం, 200 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించాడు. అలాగే ఎ.రాహుల్ జావెలిన్‌త్రో విభాగంలో బంగారు పతకం సాధించగా, సిహెచ్ రోహిత్ 1500 మీటర్ల పరుగు పందెం, కె.అశోక్ హైజంప్‌లో రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో విద్యార్థులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచాలని సూచించారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని, కాబట్టి చదువుతోపాటు క్రీడల్లో కూడా విద్యార్థులకు మంచి ప్రతిభ కనబరిచేలా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.



ముఖ్యమంత్రికి తపాలాలో పోస్టు కార్డులు వేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సమగ్రశిక్ష ఉద్యోగుల వంటావార్పు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సమాన పనికి సమాన వేతనం తదితర డిమాండ్లతో ఎస్ఎస్ఎ ఉద్యోగులు చేపట్టిన రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం పార్వతీపురంలో ఆ ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు 13వ రోజు సోమవారం కొనసాగించారు. కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం చర్చి కూడలి నుంచి స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతర నిరసన శిబిరం ఎదుట వంటా వార్పు నిర్వహించారు. అనంతరం సమస్యలు తెలియజేస్తూ ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డుల ఉద్యమం నిర్వహించారు. కార్యక్రమానికి సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణతో పాటు పలువురు నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు రమేష్, లక్ష్మణరావు, భారతి, వందన, దమయంతి, జెఎసి నాయకులు పోలినాయుడు, ఈశ్వరరావు, రమేష్, భాను, దివాకర్, అప్పారావు, దేవిశ్రీ, గౌరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాక్సింగ్ పోటీలకు అండర్ 17,19 జట్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అండర్ 17,19 బాక్సింగ్ రాష్ట్రస్థాయి టీములు జాతీయస్థాయి పోటీలలో పాల్గొనేందుకు సోమవారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లాయి. ఈ పోటీలు జనవరి 3 నుంచి 8 తేదీ వరకు ఢిల్లీ లోని త్యాగరాజ స్టేడియంలో జరగనున్నాయి. మొత్తం రెండు విభాగాలలో కలిపి 27 మంది క్రీడాకారులు, కోచ్, మెనేజర్లుగా నలుగురు వ్యాయామ ఉపాధ్యాయులు వెళుతున్నారు. ఈ క్రీడాకారులను జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కన్వీనర్, డిఇఒ బి.లింగేశ్వర రెడ్డి ,ఉప విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్‌వి రమణ, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డోల మన్మధ కుమార్ అభినందనలు తెలిపారు.

సమస్యల వలయంలో గ్రామ సేవకులు

- నాలుగున్నరేళ్లుగా అమలు కాని హామీలు
- గతంలో అమలు చేసిన డిఎ సైతం తిరిగి వసూలు
- చలో విజయవాడకు సిద్ధమవుతున్న విఆర్‌ఎలు

ప్రజాశక్తి - కురుపాం

గ్రామాల్లో కొద్దిపాటి వేతనాలతో విఆర్‌ఎలు సమస్యల వలయంలో విధులు నిర్వహిస్తున్నారు. పార్ట్‌టైం పేరుతో ప్రభుత్వం వారిచే పూర్తికాలం పని చేయించుకుంటుంది. మరోవైపు ఖాళీ పోస్టులు భర్తీ చేయకపోవటంతో విధుల్లో ఉన్న వారిపై పని ఒత్తిడి పెరుగుతోంది. ప్రభుత్వం ఎప్పటికైనా తమ సేవలను గుర్తిస్తుందని ఎదురు చూసిన విఆర్‌ఎలకు నిరాశే మిగిలింది. ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గౌరవవేతనం బదులుగా కనీస వేతనం చెల్లిస్తామని ఇచ్చిన హామీని పూర్తిగా విస్మరించారు. కనీస వేతనాలు అమలు చేయకపోగా గత ప్రభుత్వం అమలు చేసిన డిఎ రికవరీ చేసి ప్రభుత్వం వారి పట్ల కఠిన వైఖరి అవలంభించింది. గత ప్రభుత్వం 2018లో విఆర్‌ఎలకు జీతాలు పెంచడంతో పాటు డిఎ కూడా మంజూరు చేసింది. గత ప్రభుత్వం జారీ చేసిన జీవోలో తప్పు ఉందని, అందువల్ల అదనంగా వేతనం తీసుకున్నారని సాకుగా చూపుతూ డిఎను రికవరీ చేసింది. నాలుగున్నరేళ్లుగా వివిధ రూపాల్లో నిరసన తెలిపినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదు. ఈ నేపథ్యంలో జనవరి 5న చలో విజయవాడకు సిద్ధమవుతున్నారు.

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు బుట్టదాఖలు

ఉమ్మడి జిల్లాలో 1280 మంది గ్రామ రెవెన్యూ సహాయకులు(విఆర్‌ఎ)లు పని చేస్తున్నారు. వీరికి ప్రభుత్వం కేవలం రూ.10,480 మాత్రమే వేతనం చెల్లిస్తోంది. గతేడాది డిఎ రికవరీలో భాగంగా మరుసటి నెల వేతనం విడుదల చేయాలంటే డిడిల రూపంలో రూ.2,600 ప్రతి నెలా చెల్లించారు. ఒక్కొక్కరి నుంచి రూ.13,500 ప్రభుత్వం వసూలు చేసింది. మరోవైపు పని ఒత్తిడి పెరుగుతోంది. ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకోవటంతో పాటు, తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే పనుల్లోనూ కీలకంగా విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం 6 గంటలకు విధులకు హాజరైతే తిరిగి ఇంటికి చేరేసరికి రాత్రి 8 గంటలు దాటుతోందని విఆర్‌ఎలు వాపోతున్నారు. దీనికితోడు విధి నిర్వహణలోనూ అక్రమార్కులు తమను టార్గెట్ చేసి ఇబ్బందులకు గురి చేయటం పరిపాటిగా మారింది. విఆర్‌ఎలకు రక్షణ కల్పించడంతో పాటు, గౌరవ వేతనం బదులుగా కనీస వేతనం ఇస్తామని ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ప్రకటించారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లలో ఈ హామీల అమలుకు నోచుకోలేదు. డిఎ రికవరీ చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధి లేమికి నిదర్శనంగా నిలుస్తోంది.

ఇవీ విఆర్‌ఎ ల డిమాండ్లు

తెలంగాణలో ఇస్తున్నట్లుగా పే స్కేల్ చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. నామినీలుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ విఆర్‌ఎలుగా నియమించాలని కోరుతున్నారు. ఖాళీగా ఉన్న విఆర్ఎ, వాచ్మెన్, అటెండర్, కంప్యూటర్ ఆపరేటర్, జీప్ డ్రైవర్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.500 డిఎను 2018 జూన్ నుంచి వేతనంతో కూడిన డిఎగా తక్షణమే చెల్లించాలని కోరుతున్నారు.



సమస్యలు పరిష్కారం కోరుతూ విఆర్‌ఎలు చేస్తున్న ఆందోళన (ఫైల్)

చలో విజయవాడ విజయవంతం చేయాలి



ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపు నేపథ్యంలో జనవరి 5న నిర్వహించబోయే చలో విజయవాడ కార్యక్రమానికి విఆర్‌ఎల కదలిరావాలి. ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదు. మరోవైపు డిఎ సొమ్మును రికవరీ చేయడం గతంలో ఎన్నడూ లేదు. ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

జి. ఈశ్వరరావు,
మన్యం జిల్లా అధ్యక్షులు, విఆర్‌ఎ అసోసియేషన్.


భంజ్‌దేవ్‌ను కలిసిన తేజోవతి

ప్రజాశక్తి - సాలూరు

నూతన సంవత్సరం సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా కొత్తూరు మండలం జోగుపాడు గ్రామానికి చెందిన మొజురు తేజోవతి మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె ఉపాధ్యాయ ఉద్యోగానికి కూడా రాజీనామా చేశారు. ఒకటి రెండు రోజుల్లో ఆమె అమరావతిలో టిడిపి అగ్రనేత సమక్షంలో పార్టీలో చేరనున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం భంజ్‌దేవ్‌ను కలిసినట్లు తెలుస్తోంది. అనంతరం అక్కడకి వచ్చిన టిడిపి నాయకులు కార్యకర్తలు ఆమె పరిచయం చేసుకున్నారు. వారందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.



భంజ్‌దేవ్‌తో తేజోవతి



రోడ్డు మధ్యలోని మురుగునీటిలో స్వైర విహారం చేస్తున్న పంది

పందులకు ఆవాసం ప్రధాన రహదారి

ప్రజాశక్తి - మక్కువ

మండల కేంద్రమైన మక్కువ ప్రధాన రహదారి పందులకు ఆవాసంగా ఉంది. దీంతో ఈ రహదారి మీదుగా ప్రయాణించే వాహన చోదకులకు సాహస యాత్రగా మారిందని చెప్పడంలో అతిశయోక్తి కాదు. తమ ప్రభుత్వం అభివృద్ధి అంటూ ఊకదంపుడు ఊపన్యాసాలిచ్చే పాలకులకు ప్రధాన రహదారి దుస్థితి పట్టదా అని బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఈ రహదారి మరమ్మతుకు ఏ ఒక్కరూ కనీస ప్రయత్నించకపోవడం పలు విమర్శలకు దారితీస్తుంది. ఇప్పటికైనా ఈ రహదారిని బాగు చేయాలని మండల ప్రజానీకం ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.



కేక్ కట్ చేస్తున్న పిఒ కల్పనాకుమారి

పిఒకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి - సీతంపేట

నూతన సంవత్సర వేడుకలను స్థానిక ఐటిడిఎలోసోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ కల్పనాకుమారి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పిఒకు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఐటిడిఎను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, డిడి మంగవేణి, డిప్యూటీ డిఇఒ లిల్లీ రాణి, సిడిపిఒ రంగలక్ష్మి, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయపార్వతి, హరికృష్ణ పిహెచ్ఒ గణేష్, ఎఎంఒ కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ కార్టూనిస్టుగా భాస్కరరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఉత్తమ కార్టూనిస్టుగా గుంట్రెడ్డి భాస్కరరావు ఎంపికయ్యారు. విజయవాడకు చెందిన గుల్లపల్లి అరుణకుమారి స్మారక సాహిత్య సంస్థ హాస్యానంద సహకారంతో ఆన్‌లైన్‌లో కార్టూన్ల పోటీలు నిర్వహించారు. కార్టూన్ల పోటీల్లో బొబ్బిలి పట్టణానికి చెందిన భాస్కరరావుకు ఉత్తమ కార్టూనిస్ట్ అవార్డు లభించింది. ఈ నెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా భాస్కరరావుకు పురస్కారం అందించనున్నారు. భాస్కరరావును సాహితీవేత్తలు అభినందించారు.

వైసిపి మండల కమిటీ నియామకం

ప్రజాశక్తి-బొండపల్లి

వైసిపి మండల నూతన కమిటీని ఆ పార్టీ అధిష్టానం నియమించింది. మండల అధ్యక్షులుగా బొద్దల చిన్నంనాయుడు, ఉపాధ్యక్షులుగా తాళ్లపూడి అప్పలనాయుడు, మంత్రి శ్రీరాములనాయుడు, ప్రధాన కార్యదర్శులుగా బాలి మన్మథరావు, సిరిపురపు జామినాయుడు, వేమలి వెంకటరావు, కోశాధికారిగా శిరిపురపు నాయుడుబాబును నియమించారు.

మధురవాణి పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

వాజీ ఛానల్ ఎమ్‌డి గణపతినీడి శ్రీనివాసరావు నివాసంలో సోమవారం తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వర్థమాన రచయిత డోకి చంద్రశేఖర్ రాసిన మధురవాణి పుస్తకాన్ని ఆవిష్కరించారు. మంచి పుస్తకాలు నేస్తాలవంటివని, ఒక వ్యక్తి వ్యక్తిత్వాన్ని మెరుగుపరచేందుకు పుస్తకాలు దోహదపడతాయని ఈ సందర్భంగా శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో తెలుగుభాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్, రచయిత చంద్రశేఖర్ దంపతులు పాల్గొన్నారు.

ఘనంగా 'వెన్నె' పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - గుర్ల

టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఎంపిపి వెన్నె సన్యాసినాయుడు పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అభిమానులు, కార్యకర్తలతో కలసి కేక్ కట్ చేశారు. టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తిరుముల రాజు కిరణ్ కుమార్, సన్యాసినాయుడుకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా తెట్టంగిలో విజయ బ్లడ్ బ్యాంకు మెగా రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా కార్యకర్తలు, అభిమానులు సన్యాసి నాయుడుకి జన్మదిన శుభాకాంక్షలు, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వెన్నె సన్యాసినాయుడు మాట్లడుతూ రక్త దానం ప్రాణదానంతో సమానమన్నారు. తన జన్మదిన సందర్భంగా రక్తదానం చేసిన వారందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. వీరికి విజయ బ్లడ్ బాంక్ తరుపున బ్లడ్ డొనేషన్ సర్టిఫికెట్లు ను అందచేశారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని బొడ్లపాడు జంక్షన్ సమీపంలో సోమవారం పాసిన బిల్లి అరవింద్(24) అనే వ్యక్తి అనుమానస్పదంగా మృతి చెందాడు. పోలీసులు గ్రామస్తులు చెప్పిన వివరాలు ప్రకారం.. పాలకొండ మండలం గోపాలపురం గ్రామానికి చెందిన పాసినబిల్లి అరవింద్ తెలంగాణ రాష్ట్రంలోనే హైదరాబాదులో ఓ ప్రైవేట్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నారు. తోటి స్నేహితుల వద్ద అధికంగా నగదు తీసుకొని అప్పులు తీర్చలేక తల్లిదండ్రులకు చెప్పడానికి భయపడి మనస్థాపంతో ఉండేవాడు. ఈ నేపథ్యంలో బొడ్లపాడు జంక్షన్ సమీపంలో అరవింద్ కాలిపోయి మృతి చెందిన విషయాన్ని గ్రామస్తులు గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఎం గోవిందరావు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని శవ పంచనామ చేసి పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడు అరవింద్ గ్రామం గాని గ్రామంలో మృతి చెందడంతో చర్చనీయంగా మారింది. తండ్రి ఎర్రమనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం గోవిందరావు తెలిపారు.

'బోరు'మంటున్నారు..

- ఎదుగూ బొదుగూ లేని బోరు మెకానిక్ జీవితాలు
- 30 ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలు
- సిఎంకు చెప్పినా పట్టించుకోని వైనం
- రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని వేడుకోలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

గ్రామీణ ప్రాంతాలలో తాగునీటికి ఆధారమైన బోరుబావులు, పంపులు ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేస్తూ పల్లెల దాహార్తిని తీర్చడానికి రేయింబవళ్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ నీటిసరఫరాకు అంతరాయం కలగకుండా కృషి చేస్తున్న బోరు మెకానిక్‌ల జీవితాలు 30ఏళ్లుగా ఎదుగూ బొదుగూ లేకుండా ఉన్నాయి. 1994లో గ్రామీణ నీటిపంపుల మరమ్మత్తులతో పాటు రక్షిత మంచినీటి పథకాల మరమ్మత్తులు నిర్వహణ కోసం ఏర్పడిన మండల కాంట్రాక్టు బోరు మెకానిక్‌ల వ్యవస్థలోని మెకానిక్‌లు కేవలం గ్రామీణ నీటి సరఫరా శాఖ అందించే వేతనాలు తప్ప ఏవిధమైన సదుపాయాలు లేక అలమటిస్తున్నారు. 30 ఏళ్లుగా సేవలు అందిస్తున్న వారికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాల్సి ఉంది. కానీ ఆ స్థాయిలో వేతనాలు ఇవ్వడం లేదు. దీంతో బోరు మెకానిక్‌లు ఆకలితో అలమటిస్తున్నారు.

విజయనగరం ఉమ్మడి జిల్లా పరిధిలో దాదాపు 69 మంది బోరు మెకానిక్‌లు పనిచేస్తున్నారు. వీరికి కార్మిక చట్టం ప్రకారం వర్తించవలసిన పిఎఫ్, జిపిఎఫ్, ఈఎస్ఐ ఆసుపత్రి సేవలు దక్కకపోగా, పదవీ విరమణ అనంతరం ఒక్కరూపాయి కూడా పరిహారం పొందలేని దుస్థితిని ఎదుర్కొంటున్నారు. విధి నిర్వహణలో చనిపోయినప్పటికీ ఎటువంటి భీమా సదుపాయం లేక కుటుంబాలు వీధినపడే పరిస్థితి ఉంది. 30ఏళ్లసర్వీసు ఉన్న వీరికి ఉద్యోగ బాధ్యతల నుంచి తప్పుకునేనాటికి ఎటువంటి ఆర్థిక సహాయం కానీ, పింఛన్ సదుపాయాలు కానీ ఇవ్వడం లేదు. తమకు కనీసం వేతనం ఇప్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఎన్నోసార్లు అధికారులతోపాటు, ముఖ్యమంత్రులకు వేడుకున్న ప్పటికీ వీరిని ఆదుకునేవారే కరువయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎన్నికల ముందు చేపట్టిన పాదయాత్రలో అధికారంలోకి రాగానే కార్మిక చట్టాల ప్రకారం సౌకర్యాలు, కనీసవేతనాలు, ఇతర సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల సిఎం జగన్ గిరిజన యూనివర్శిటీ శంకుస్థాపనకు జిల్లాకు వచ్చినపుడు వినతి అందించగా, తప్పకుండా



మరమ్మతుకు గురైన బోరును బాగు చేస్తున్న మెకానిక్‌లు

పరిశీలిస్తామని ఇచ్చిన హామీపై చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు 30ఏళ్లుగా తాము అందిస్తున్న సేవలను గుర్తించి, తమకు ఉద్యోగ భద్రతతోపాటు, కనీస వేతనాలు, కార్మిక చట్టాల ప్రకారం ఇతర సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.


పనికి తగిన వేతనం అందించాలి



పల్లెల్లో నీటిఎద్దడిలేకుండా నిరంతరం తాగునీరు అందించేందుకు కృషిచేస్తున్న మా 30 ఏళ్ల సేవలను దృష్టిలో ఉంచుకుని కనీస వేతనం కల్పించాలి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు అందించడమే కాకుండా, పదవీ విరమణ అనంతరం పింఛన్ సదుపాయాలు కల్పించాలి, కార్మికులుగా గుర్తించి, కార్మిక చట్టాల ప్రకారం ఇతర సౌకర్యాలు కల్పించాలి.

ముద్దాన శ్రీనివాసరావు, బోరుమెకానిక్, పార్వతీపురం

మెకానిక్‌లకు భీమా సదుపాయం కల్పించాలి



రాత్రి పగలూ ఎప్పుడు సమస్య వస్తే అప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో నిరంతరం సేవలు అందిస్తున్న బోరు మెకానిక్‌ల జీవితాలకు, భద్రత కల్పించాలి. జీవిత గురుగుబిల్లి మెకానిక్ 25ఏళ్లుగా సేవలు అందించిన అనంతరం మరణించగా, అతని కుటుంబానికి ప్రభుత్వం నుండి గానీ, పనిచేస్తున్న పంచాయతీరాజ్ శాఖ నుండి కానీ ఒక్కరూపాయి ఆర్థిక సహాయం అందక వీధిన పడిన పరిస్థితి ఏర్పడింది. కనుక రాష్ట్ర వ్యాప్తంగా బోరుమెకానిక్‌లు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను గమనించి మా సమస్యలు సానుకూలంగా పరిష్కరించాలి.

రాయగడ శేఖర్, బోరు మెకానిక్ జియ్యమ్మ వలస

దున్నపోతుకు వినతి

- ఏడో రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె
- చేతులు తాళ్లతో కట్టుకుని నిరసన
- పలు చోట్ల కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రజారోగ్య ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్, వాటర్ సెక్షన్ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారానికి ఏడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ ఆధ్వర్యంలో పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె శిబిరం వద్ద దున్నపోతుకు వినతి పత్రం ఇచ్చి వినూత్నంగా నినాదాలు ఇచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ సమ్మె చేపట్టి ఏడు రోజులైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని, కార్మికుల సమస్యలు మీకు పట్టవా అని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్, ఆప్కాస్ విధాన కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, ఇంజినీరింగ్ వర్కర్లందరికీ హెల్త్ అలవెన్స్ రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు చీపురుపల్లి సింహాచలం, పడాల గాంధీ, మామిడి శివ, బంగారు రాజేష, గుంట్రెడ్డి గంగయ్యలు, తాడ్డి వినయ్, వంగపండు అప్పలనాయుడు, మేడిశెట్టి కృష్ణ, అరసాడ తాతబాబు, నాగవంశం మల్లేసు, బంగారు రవి, నిర్మల ఇప్పలమ్మ, పాపులమ్మ, పడాల సంతు, వెంకన్న, సాయి, రవి, సత్తిరాజు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.



సాలూరు : చేతులకు తాళ్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

సాలూరు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె ఏడో రోజు కి చేరింది. సోమవారం నిరసన శిబిరం వద్ద మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షుడు టి.రాముడు, కార్యదర్శి టి.శంకరరావు ఆధ్వర్యాన కార్మికులు చేతులను తాళ్లతో కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు మాట్లాడుతూ ఏడు రోజులుగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమని అన్నారు. పట్టణాల్లో పారిశుధ్య పనులు స్తంభించిపోయే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. త్వరలో తాగునీటి సరఫరా, విద్యుత్ విభాగాల సిబ్బంది కూడా సమ్మెకు దిగనున్నారని, దీనివల్ల తలెత్తే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు పోలరాజు, స్వప్న రవి పాల్గొన్నారు.



పార్వతీపురం: దున్నపోతుకు వినతినిస్తున్న కార్మికులు

పాలకొండ : ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె సోమవారానికి ఏడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలో ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, కరపత్రాలు పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాలా రమణారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పడాల భాస్కరరావు, చింతల సంజీవి, పడాల వేణు తదితరులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి తక్షణమే జోక్యం చేసుకొని మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పాలకవర్గాలు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో, అసెంబ్లీ సాక్షిగా జగన్ అన్న ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చింతల సురేష్, శ్రీదేవి, విమల, మధు, రామరాజు, ఎన్ సాయికుమార్, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ : కరపత్రాలను పంపిణీ చేస్తున్న కార్మికులు

పల్లి ఆశయాలను నెరవేరుస్తాం

ప్రజాశక్తి-మెంటాడ

రైతులకు సాగునీరు, విద్య, వైద్యం, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ఎనలేని కృషి చేసిన పల్లి తిరుపతిరావు మాస్టారు ఆశయాలను నెరవేరుస్తామని ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు తెలిపారు. సోమవారం గుర్ల గ్రామంలో పల్లి తిరుపతిరావు 64వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్లగెడ్డ మినీ ప్రాజెక్టు నిర్మాణం కోసం అహర్నిశలు పాటుపడ్డారని కొనియాడారు. ఈ సందర్భంగా వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెవివి జాతీయ ఉపాధ్యక్షులు గండ్రేటి లక్ష్మణరావు, నాయకులు ఎంవిఆర్ కృష్ణాజీ, రాష్ట్ర అధ్యక్షులు ఎంవిఎస్ వెంకటరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.అప్పలనాయుడు, సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు, సర్పంచ్ బొద్దల సత్యవతి, రెడ్డి రాజగోపాల్, పల్లి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తా : గద్దె

ప్రజాశక్తి-చీపురుపల్లి

రానున్న అసెంబ్లీ ఎన్నికలలో తమ కుటుంబం నుండి శాసన సభకు పోటీ చేయనున్నట్లు మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు తెలిపారు. స్థానిక నటరాజ్ రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రమంతా అవినీతి మయంగా ఉందన్నారు. ఇసుక, భూములు, మైనింగ్, మద్యంలలో పెచ్చుమీరి అవినీతి జరుగుతోందన్నారు. గంజాయి, గుట్కా కూడా అదుపు అడ్డూ లేకుండా రవాణా జరుగుతోందని గుర్తు చేశారు. రాష్ట్రంలో కేవలం కలక్షన్ చేసి సెలక్షన్ చేసి ఎలక్షన్‌కి వెళ్లేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఎద్దేవా చేశారు. తన కుటుంబం నుండి ఒకరు వచ్చే ఎన్నికలలో పోటీకి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. అది ఏ పార్టీ నుండి అనేది మాత్రం త్వరలో చెబుతానని గద్దే అన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- బలిజిపేట

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, సంక్షేమ బోర్డు పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అందించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం రాస్తారోకో నిర్వహించింది. ఈ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు చెప్పాడ సుబ్బయ్య మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు సమస్యలు పరిష్కారం చేస్తానని ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చి ఇప్పుడు మోసం చేశారన్నారు. ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్టమొదట భవన నిర్మాణ కార్మికుల బ్రతుకులు నాశనం చేసేలా ఇసుక విధానం తీసుకు వచ్చారని చెప్పారు. కరోనా సమయంలో భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులు పడినా కనీసం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం కనికరించలేదన్నారు. పైగా రాజశేఖర్ రెడ్డి భవ నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం వాళ్ళ కుటుంబాలు ఆనందం కోసం సంక్షేమ బోర్డును ప్రవేశపెడితే మడమ తిప్పను మాట తప్పను అని నమ్మించి తండ్రి తెచ్చిన సంక్షేమ బోర్డును కొడుకు జగన్మోహన్ రెడ్డి రద్దు చేయడం అత్యంత దారుణమన్నారు. రాస్తారోకో అనంతరం అంగన్వాడీలు చేస్తున్న పోరాటానికి ర్యాలీగా వెళ్లి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు నూలకమజ్జి గౌరీ, చింతాడు కైలాసం, శ్రీను, మురళి, చక్రధర్, గణపతి, వెంకన్న, తిరపతి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

లక్ష్యాలను చేరుకోవాలి

ఎస్‌పి దీపిక పాటిల్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా పోలీసు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఎస్ఐబి అదనపు ఎస్‌పి ఎస్.వెంకటరావు, ఎఆర్ అదనపు ఎస్‌పి ఎంఎం సోల్మన్, విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి, విజయనగరం ట్రాఫిక్, డిటిసి, ఎఆర్ డిఎస్‌పిలు ఆర్.గోవిందరావు, పి.శ్రీధర్, ఎ.ఎస్.చక్రవర్తి, డి.విశ్వనాథ్, వీరకుమార్, యూనివర్స్, పలువురు సిఐలు, ఎస్ఐలు, పలువురు పట్టణ ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఎస్‌పిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని, పోలీసుశాఖ నిర్దేశించుకున్న లక్ష్యాలుకు చేరుకొనే విధంగా సమర్ధవంతంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని, పోలీసుశాఖ ప్రతిష్టను పెంచే విధంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్‌పి దీపిక పాటిల్

యుటిఎఫ్ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -భామిని


స్థానిక మండల వనరుల కేంద్రంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంఇఒలు శ్రీనివాసరావు, యు.భాస్కరరావు యుటిఎఫ్ కేలండరు, డైరీని ఆవిష్కరించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఈగల తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కె.ప్రసాద్, కె.క్రాంతి కుమార్, బి.మహేష్, పి.తిరుపతిరావు, బాల దుర్గాప్రసాద్, ఎం.నాగేశ్వరరావు, బి.మురళీధర్, పి.లుడాతచిన్, కె.అప్పలనాయుడు, టి.వెంకటరమణ, టి.హేమలత, అప్పారావు, జగన్నాథ్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతానగరం : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని యుటిఎఫ్ ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఎంఇఒలు జి.సూరిదేముడు, ఎంవి రమణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు, జిల్లా కార్యవర్గసభ్యులు ఎం.గోవిందరావు, కార్యవర్గ సభ్యులు బి. ఆదినారాయణ, ఎ.పోలినాయుడు, కె.మురళి, ఎన్.త్రినాథ్, కోశాధికారి డివి రమణ, తవిటి నాయుడు, మరియు గిరి పాల్గొన్నారు.

పాఠశాల కేలండర్ ఆవిష్కరణ

గుమ్మలక్ష్మీపురం: జియ్యమ్మవలస మండలంలోని పెదమేరంగిలో శ్రీ సత్యకైలాస్ పాఠశాల కేలండర్‌ను సోమవారం ప్రముఖ దర్శకులు, రచయిత, నటులు రౌతు వాసుదేవరావు మాస్టారు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేలండర్లు దినచర్యను సూచిస్తాయని ఇవి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగేందుకు దోహదపడతాయని అన్నారు. అజయ్ కుమార్ మాట్లాడుతూ కేలండర్లను బేష్ చేసుకుని చాలా మంది ప్రణాళికలు సిద్ధం చేసుకుంటారన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాలతేరు రాజశేఖర్ రావు వ్యవహరించగా, సమన్వయకర్తగా పాలక హరికృష్ణ వ్యవహరించారు.

ఎపిటిఎఫ్ కేలండర్ ఆవిష్కరణ



సీతానగరం: కేలండర్ ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

వీరఘట్టం: స్థానిక ఎంఆర్‌సి కార్యాలయ ఆవరణలో సోమవారం మండల విద్యాశాఖ అధికారులు గౌరు నాయుడు, ఆనందరావులు 2024 సంవత్సర ఎపిటిఎఫ్ డైరీ, కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ మండల శాఖ నాయకులు యం. మురళి, ఆర్. ధనుంజయ నాయుడు, డి. శ్రీనివాసరావు, ఎం. నరహరిరావు, ఎం. అప్పలనాయుడు, ఎం. రాయినాయుడు, బియం గౌరీశ్వరరావు, శేఖర్, రాంబాబు, ముద్దులమ్మ, పద్మావతి, రాజేశ్వరి, రమణ నాయుడు, తిరుపతిరావు, అన్నాజీ, రాము, రాజశేఖర్, సురేష్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతుకు పెద్ద కష్టం

- కాలి బూడిదైన 5 ఎకరాల వరి పంట
- రూ.లక్ష సాయం అందించిన గ్రామస్తులు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

సొంతంగా సెంటు భూమి లేకపోయినా, భూమిని కౌలుకు తీసుకుని, అహర్నిశలు కష్టపడుతూ వచ్చే ఆదాయంతో ఏడాదంతా జీవనం కొనసాగించే రైతు ఆశలను అగ్నిప్రమాదం బుగ్గి చేసింది. మండలంలోని పెదబొండపల్లికి చెందిన పేద కౌలు రైతు రొంపిల్లి తవిటి నాయుడుకు చెందిన ఐదు ఎకరాల వరి పంట చేను నూర్పులు కోసం ఉంచగా ఆదివారం అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో మొత్తం పంట కాలిపోయింది. గుర్తు తెలియని వ్యక్తులు కారణంగా సంభవించిన ఈ ప్రమాదంలో పంట నష్టం సుమారు మూడు లక్షల రూపాయల విలువ ఉంటుందని అగ్ని ప్రమాద అధికారి, మండల విఆర్ఒ ప్రాథమిక అంచనా వేశారు. తెల్లారితే యంత్రం సహాయంతో నూర్పులు పూర్తిచేసి ధాన్యాన్ని మిల్లుకు పంపించి వచ్చిన డబ్బులు భూమి యజమానికి చెల్లించి మిగతా డబ్బుతో పండగ అవసరాలను అప్పులను తీర్చుకోవచ్చునని ఆశపడ్డాడు.

ఈ సమయంలో జరిగిన ఈ ప్రమాదంతో ఏడాదంతా కష్టపడిన పంట కాలి బూడదవడంతో ఆ కౌలు రైతు చేసిన రోధన కంట తడి పెట్టించింది. గ్రామంలో అందరితో కలిసి మెలసి అజాతశత్రువుగా పేరు తెచ్చుకున్న తవిటి నాయుడుకు వచ్చిన కష్టం చూసి గ్రామ ప్రజలు అక్కడికక్కడే తలా కొంత ఆర్థిక సాయం ప్రకటించగా లక్ష రూపాయల మొత్తం సమకూరింది. తమ వంతు సహాయంగా ఆ కూలి రైతుకు ఈ మొత్తాన్ని అందించి ఆదుకుంటామని ఆయనకు భరోసా కల్పించారు. ప్రభుత్వ అధికారులు కూడా స్పందించి పంట నష్ట పరిహారాన్ని అందించే ఏర్పాటు చేసి ఆ రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కాలిపోతున్న వరి చేను కుప్పలు